క్లుప్తంగా

నేడు వాసవీ పారాయణం

జగద్గిరిగుట్ట: లోక కల్యాణార్థమై, ప్రపంచ శాంతి కోసం 102 వాసవీ మాత దేవాలయాలలో వాసవీ పారాయణంలో భాగంగా జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీవాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం గోపూజ, ఉత్సవమూర్తికి అభిషేకం, శ్రీచక్ర యంత్ర పూజ, వాసవీ పారాయణం, ప్రవచనం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్/సుభాష్‌నగర్: బాచుపల్లి ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి సెక్షన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు.11కేవీ ఏసీటైర్, మల్లంపేట్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు.

◆ ప్రగతినగర్ సెక్షన్ పరిధిలోని 11కేవీ కోకకోలా, భౌరంపేట్ కేబుల్, కేవీఆర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సింహపురి కాలనీ, మైస్పేస్ అపార్ట్‌మెంట్స్, హమారా దాబా, ఎస్‌ఆర్‌ఆర్ వెంచర్స్, రోజా వెంచర్, వీఎన్ఆర్ ఓల్డ్ ఏజ్‌హోమ్ ప్రాంతం, బౌరంపేట్ గ్రామం, సుకృతి హోమ్ అపార్ట్‌మెంట్స్, ప్రణీత్ ఆర్కిడ్, కేవీఆర్ వ్యాలీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ప్రగతినగర్ ఏఈ తెలిపారు.

◆ చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని గాజులరామారం సబ్‌స్టేషన్ ఏఈ చైతన్యభార్గవ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ కైలాస్‌హిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు షిర్డి హిల్స్, కైలాస్ హిల్స్, మహదేవపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

దోమల నివారణపై స్పెషల్ డ్రైవ్



జీడిమెట్ల: దోమలు నివారణ కోసం గురువారం ఎస్ఆర్‌నాయక్‌నగర్‌లో జీహెచ్ఎంసీ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎంటమాలజీ సిబ్బంది కాలనీలోని ప్రతి ఇంటికి తిరుగుతూ దోమల మందును పిచికారి చేశారు.ఇళ్లల్లో పాత వస్తువులలో నీరు నిల్వ ఉండకుండా ప్రజలు చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరారు. అనంతరం సాయంత్రం కాలనీలోని అన్ని రోడ్లలో ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ ఉమారాణి ప్రజలతో మాట్లాడుతూ.. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. స్పెషల్‌డ్రైవ్‌ను కాలనీ అధ్యక్షులు గోగినేని శ్రీనివాస్, ఎంటమాలజీ సూపర్‌వైజర్ సిద్దిరాంరెడ్డి పర్యవేక్షించారు.

మాదిగ జర్నలిస్టుల జాతీయ సభను విజయవంతం చేయాలి

జగద్గిరిగుట్ట: ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 19న జరిగే మాదిగ జర్నలిస్టుల జాతీయ సభను విజయవంతం చేయాలని మాదిగ జర్నలిస్టుల ఫోరం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎర్రయాకన్న గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హెల్త్, అక్రిడేషన్ కార్డులు, బస్‌పాస్, ట్రైన్ పాస్‌లు ఈ సభలో చర్చలు, తీర్మానాలు ఉంటాయని తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని సభని విజయవంతం చేయాలని కోరారు.

నెల తర్వాత స్పందించారు

సాక్షి ఎఫెక్ట్..

చింతల్: భగత్‌సింగ్ నగర్ రోడ్‌నం.4లో నెల రోజులుగా వెలగని వీధి దీపాల సమస్యకు అధికారులు స్పందించారు. గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన 'వెలగని వీధి దీపాలతో పరేషాన్'అనే శీర్షికకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు. ఉదయం 10 గంటలకు వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

భూగర్భ డ్రైనేజీ పనుల పరిశీలన

చింతల్: గాజులరామారం డివిజన్‌లోని ఆర్కే లేఅవుట్‌లో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను గురువారం కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్ రెడ్డి అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్కే లేఅవుట్‌లో ఎక్కువ భాగం బండ రాళ్లు ఉండటంతో పనులు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. భారీ గోతులు ఏర్పడిన కారణంగా ఎటువంటి ప్రమాదాలు తలెత్తకుండా తక్షణ ఏర్పాటల్లో భాగంగా భారీ కేడ్లు, హెచ్చరిక బోర్డులను, రిబ్బన్లను కట్టి ఎటువంటి అవంతరాలు లేకుండా పనులను చేపట్టాలన్నారు. షాపూర్‌నగర్ డీజీఎం అప్పలనాయుడు, మేనేజర్ రోహిణి తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం శ్రావణమాస ప్రారంభమైన నేపథ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మధుసూదనాచార్యులు, కృష్ణ చైతన్య, రామానుజ చార్యులు తీర్థప్రసాదాలు అందజేసి భక్తులను ఆశీర్వదించారు.

నాన్నకు ప్రేమతో...

తండ్రి జ్ఞాపకార్థం రూ.కోటితో కళాశాల భవన నిర్మాణం



- కేఎం పాండు జయంతి సందర్భంగా వొకేషనల్ కళాశాల ప్రారంభం
- హాజరైన మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు కృష్ణారావు, హన్మంతరెడ్డి
- సొంత నిధులతో కళాశాలను నిర్మించిన ఎమ్మెల్యే వివేకానంద్‌కు అభినందనల వెల్లువ

కుత్బుల్లాపూర్: బహదూర్‌పల్లిలో కేఎం పాండు మెమోరియల్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలను రూ.కోటి తన సొంత నిధులతో ఎమ్మెల్యే వివేకానంద్ నిర్మించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ రాజకీయ పితామహుడు దివంగత కేఎం పాండు 78వ జయంతి సందర్భంగా గురువారం మంత్రి మల్లారెడ్డి, కూకట్‌పల్లి, మల్కాజిగిరి ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, హన్మంతరావు ముఖ్యఅతిథులుగా హాజరైన కళాశాల భవనాన్ని ప్రారంభించారు.

కేఎం పాండు పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు..

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేఎం పాండు 20 సంవత్సరాలు సర్పంచ్‌గా, మేడ్చల్ పంచయతీరాజ్ సమితి వైస్ ప్రెసిడెంట్, కుత్బుల్లాపూర్ మున్సిపల్ మొదటి చైర్మన్‌గా, మూడు దశాబ్దాల పాటు నియోజకవర్గ ప్రజలకు అనేక సేవలు అందించారని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఎమ్మెల్యే వివేకానంద్ తన తండ్రి జ్ఞాపకార్థం నియోజకవర్గ పరిధిలో పేద విద్యార్థులకు ఉపయోగపడే విధంగా వొకేషనల్ కళాశాలను నిర్మించడం గర్వకారణమని అన్నారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ.. పేదల అభ్యున్నతికి కృషి చేస్తూ.. తండ్రికి తగ్గ తనయుడిగా ఎమ్మెల్యే పేరు ప్రఖ్యాతలు సంపాదించారని వారు పేర్కొన్నారు. ఈ ప్రాంతం నుంచి ఎమ్మెల్యే వివేకానంద్‌కు హ్యాట్రిక్ విజయం సాధించిపెట్టాలని కార్యకర్తలు, ప్రజలను మంత్రి మల్లారెడ్డి కోరారు.

త్వరలో పేద విద్యార్థుల కోసం డిగ్రీ, మెడికల్ కాళాశాల నిర్మాణం

◆ ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. ఫీజులు చెల్లించని స్థితిలో ఉన్న పేద విదార్థులు విద్య గురుంచి చింతించాల్సిన అవసరంలేదు. ఇప్పుడు నిర్మించిన ఈ వొకేషనల్ జూనియర్ కాలేజీతో పాటు త్వరలో నిర్మించబోతున్న డిగ్రీ, మెడికల్ కాలేజ్ పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని విద్యార్థులు ఈ కళాశాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులతో కళాశాల ఆవరణ మొత్తం సందడిగా మారింది. మంత్రి మల్లారెడ్డి రాకతో ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా ఉత్సాహంతో కేరింతలతో హోరెత్తింది.

◆ జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలో హరిజనవాడలో ఎమ్మెల్యే వివేకానంద్ తన సొంత నిధులతో కేఎం పాండు జ్ఞాపకార్థం రూ.9.5లక్షలతో నిర్మించిన మాదిగ చైతన్య సంక్షేమ సంఘం భవనాన్ని మంత్రి మల్లారెడ్డితో కలిసి ప్రారంభించారు.

◆ చింతల్‌లోని కేఎం పాండు మార్గ్ వద్ద ఉన్న పాండు విగ్రహానికి మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్‌లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మహిళలకు కుట్టు మెషిన్లను పంపిణీ చేశారు.

◆ కుత్బుల్లాపూర్ గ్రామంలో సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కేఎం పాండు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.



బహదూర్‌పల్లి చౌరస్తాలోని కేఎం పాండు మెమోరియల్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును సత్కరించిన ఎమ్మెల్యే వివేకానంద్





వొకేషనల్ జూనియర్ కళాశాల, మాదిగ చైతన్య సంక్షేమ సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు వివేకానంద్, మాధవరం కృష్ణారావు



చింతల్‌లో మహిళలకు కుట్టు మెషిన్లను పంపిణీ చేసిన మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్

చెత్త తరలింపు ప్రక్రియ షురూ

- అధికారులతో కలిసి పరిశీలించిన జెడ్‌సీ మమత

కుత్బుల్లాపూర్: హెచ్ఎంటీ ప్రధాన రహదారి వెంబడి షాపూర్‌నగర్‌లోని బాలానగర్ డీసీపీ కార్యాలయం నుంచి జగద్గిరిగుట్ట బీరప్పనగర్ వరకు ఉన్న పైపులైన్ రోడ్డులో ఇరువైపులా పేరుకుపోయిన చెత్తచెదారులపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత ప్రత్యేక దృష్టి సారించారు. సుమారు నాలుగు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ రోడ్డుకు ఇరువైపులా చెత్తను తొలగించే ప్రక్రియను చేపట్టారు.

◆ ఒకవైపు గాజులరామారం మరోవైపు కుత్బుల్లాపూర్ జంట సర్కిల్ అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డు వెంట చెత్త మొత్తం పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోందని పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో జోనల్ కమిషనర్ మమత అక్కడ పర్యటించి అధికారులకు స్పెషల్ డ్రైవ్ ద్వారా చెత్తను తొలగించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించడంతో ఆగమేఘాల మీద రెండు రోజులుగా చెత్తను తొలగించే పనిలో ఉన్నారు.

◆ అనేక ప్రాంతాల నుంచి సేకరించి ఆటో రిక్షాల్లో తీసుకువచ్చే చెత్తను వేరు చేసే క్రమంలో కొంతమంది రిక్షావాలా రోడ్డుకు పక్కనే వీటిని వదిలివేయడంతో ఈ సమస్య ఎదురవుతుందన్నారు. ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి కట్టడి చేయాలని స్థానికులు కోరారు. గురువారం పనులను పర్యవేక్షించిన కమిషనర్ వెంట ఉపకమిషనర్లు మల్లయ్య, నాగమణి తదితరులు ఉన్నారు.



పైపులైన్ రోడ్డులో చెత్త తరలింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న జెడ్‌సీ మమత, అధికారులు

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

దుండిగల్: మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలోని కేవీఆర్ వ్యాలీలో రూ.25 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం వార్డులో పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శంకర్‌నాయక్, సాయిబాబా, నేతలు సుధాకర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, కుంటి నాగరాజు, బాలకృష్ణ, శ్యామ్‌రావు, చంద్ర తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీ కార్యాలయాల్లో నూతనంగా విధుల్లో చేరిన సిబ్బంది శంభీపూర్ కృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు.



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న శంభీపూర్ కృష్ణ

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని వినతి

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని శివానగర్ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని బీజేపీ నాయకుడు జేకే శేఖర్‌యాదవ్ అన్నారు. దీనిపై గాజులరామారం సర్కిల్, కూకట్‌పల్లి సర్కిల్‌లో చాలాసార్లు వినతిపత్రం ఇచ్చామని... దీనిపై ఎవరూ స్పందించడం లేదని గురువారం కూకట్‌పల్లి జెడ్‌సీ మమతకు వినతి పత్రం అందజేశారు. వీలైనంత తొందరగా సమస్యను పరిష్కరించాలని ఆయన విన్నవించారు. దీనికి జెడ్‌సీ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తూ ముందుకు సాగుతున్నామని మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధి బృందావన్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ లైన్ సదుపాయం లేకపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై గురువారం ఆయన స్థానికంగా పర్యటించారు. కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేసేలా కృషి చేస్తానన్నారు.

◆ అదే విధంగా పైపులైన్ రోడ్డులోని ఆరేమ్స్‌బర్గ్ అపార్ట్‌మెంట్ ప్రధాన రోడ్డు, శ్వేత ఆర్యన్ అపార్ట్‌మెంట్ ఎదురుగా డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు జామై మురుగు రోడ్లపై పారుతున్న విషయాన్ని ఆయన జలమండలి అధికారులకు తెలిపారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సురేందర్ రెడ్డి, రవీందర్, సత్తిరెడ్డి, రాజశేఖర్, రఘు రామ్, సాంబ శివరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.


దశలవారీగా పనులు చేపడతాం

- ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ తీసుకుంటానని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు గురువారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయానికి వెళ్లి సమస్యలను వివరించారు. పలువురు తమకు ఆర్థికంగా సహాయం అందించాలని కోరగా ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందిస్తూ వారికి ప్రభుత్వ పరంగా రావలసిన పింఛన్ ఇతర పథకాలను వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు.

◆ కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ మున్సిపాలిటీకి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని పలువురు కార్పొరేటర్లు ఎమ్మెల్సీని కలిసి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు.

◆ ఎమ్మెల్సీ రాజు మాట్లాడుతూ.. ఇప్పటికే కుత్బుల్లాపూర్ లో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో తప్పకుండా దశలవారీగా పనులు చేపడతామన్నారు. ఎన్నికల సమయంలో వివిధ రాజకీయ పార్టీలు నాయకులు వచ్చి ఇది చేస్తాం.. అది చేస్తామంటూ... ప్రజలను మభ్యపెట్టే పరిస్థితి తీసుకొస్తారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను గెలిపించుకునే దిశగా అడుగులు వేయాలని కోరారు.



ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజును కలిసిన వివిధ ప్రాంతాల ప్రజలు

కార్డన్ సెర్చ్

జీడిమెట్ల: జీడిమెట్ల పీఎస్ పరిధిలో గురువారం రాత్రి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. బాలానగర్ ఏసీపీ గంగారాం ఆధ్వర్యంలో 6మంది సీఐలు, 15మంది ఎస్సైలు, 50మంది కానిస్టేబుళ్లు, ఎస్ఓటీ సిబ్బందితో కలిసి సంజయ్‌గాంధీ నగర్, షాపూర్‌నగర్ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేని 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

◆ అదే విధంగా 12 మంది రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. 24మంది అనుమానితులను గుర్తించి వారి వివరాలు రికార్డు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. అనుమానిత వ్యక్తులుగా ఎవరైన కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్డన్ సెర్చ్‌లో జీడిమెట్ల, జగద్గిరిగుట్ట ఇన్స్‌పెక్టర్లు పవన్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌టీపీ అధినేత్రి నిర్ణయాన్ని శిరసా వహిస్తాం

సుభాష్‌నగర్: వైఎస్ఆర్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల పార్టీ భవిష్యత్‌కు ఏ నిర్ణయం తీసుకున్నా శిరసా వహిస్తామని కుత్బుల్లాపూర్ వైఎస్సార్‌టీపీ అసెంబ్లీ కోఆర్డినేటర్ సాతాల గోపాల్ అన్నారు. గురువారం దేవేందర్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోపాల్ మాట్లాడుతూ.. దివంగత నేత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతోనే తెలంగాణ ప్రాంతంలో అభివృద్ధి జరిగిందన్నారు. మళ్లీ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనించాలంటే అది వైఎస్ షర్మిలతోనే సాధ్యమవుతుందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నాయకులు, కార్యకర్తలు షర్మిల నిర్ణయానికి కట్టుబడి ఉండి పని చేస్తామన్నారు.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షిస్తాం

- నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి

నిజాంపేట్: ప్రభుత్వ స్థలాలను పరిరక్షించి ప్రజావసరాలకు వినియోగిస్తామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. గురువారం డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ ఆగం పాండుముదిరాజ్‌లతో కలిసి నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద మేయర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ... ప్రగతినగర్‌లో చాలా కాలంగా వైకుంఠ ధామం, డంపింగ్ యార్డ్ వాడుకలో ఉందన్నారు. అయితే ఇటీవల కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు సదరు స్థలం మాదన్నట్టు శంషీగూడ సర్వే నెం.57 పేరుతో కోర్టులో తప్పులు డాక్యుమెంట్లు సమర్పించి అనుమతులు పొందారన్నారు. ఈ క్రమంలోడంపింగ్ యార్డ్‌ను మట్టితో పూడ్చివేశారని శ్మశానవాటికను సైతం ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే వివేకానంద దృష్టికి తీసుకెళ్లగా స్థానికంగా పర్యటించిన ఆయన సదరు పట్టా భూమిని కార్పొరేషన్‌కు కేటాయించేలా కృషి చేస్తానని తెలిపారన్నారు.

గృహ, వాణిజ్య పన్నులపై తీర్మానం..

నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్ ప్రాంతాల్లోని అన్ని గృహ, వాణిజ్య సముదాయాలకు ఒకే విధంగా పన్ను విధించేలా నిజాంపేట్ కార్పొరేషన్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించామని తెలిపారు. డబుల్ ఇళ్లను దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల చివరిలో లాటరీ పద్ధతిలో కేటాయిస్తామన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతో పాటు వేతనాల పెంపు విషయమై జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, కో.ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సాధారణ సర్వసభ్య సమావేశం..

◆ మేయర్ నీలారెడ్డి అధ్యక్షతన గురువారం 20వ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇంజినీరింగ్, పరిపాలన, పట్టణ ప్రణాళిక, హార్టికల్చర్, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, పారిశుద్ధ్యం వంటి విభాగాలకు సంబంధించి ఆమోద ప్రతిపాదనలు, ఆయా డివిజన్ల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులు, పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, కమిషనర్ రామకృష్ణారావు, కార్పొరేటర్లు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీలారెడ్డి

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నిజాంపేట్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాచుపల్లి ఇందిరానగర్‌లోని రైసినా కన్‌స్ట్రక్షన్ గేటు సమీపంలోని గుంతలో పడి స్థానికంగా భిక్షాటన చేసే బాలా అనే వ్యక్తి రెండు కాళ్లకు, తలకు తీవ్రగాయాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా చికిత్స పొందుతున్న అతను ఈ నెల 16న మృతి చెందాడు. రైసినా కన్‌స్ట్రక్షన్స్ సూపర్‌వైజర్ మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు స్థానికంగా భిక్షటన చేస్తూ బస్టాప్‌లలో నిద్రించేవాడని స్థానికులు పేర్కొన్నారు.

'డబుల్' ఇళ్లు ఇవ్వకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

దుండిగల్: బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేస్తోందని రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి అన్నారు. అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూమ్‌లు కేటాయించాలని గండిమైసమ్మ–దుండిగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్‌రూమ్ అంటూ వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన సీఎం కేసీఆర్ వాటిని విస్మరించారన్నారు. వెంటనే నిరుపేద ప్రజలకు డబుల్ బెడ్‌రూమ్‌లను అందజేయాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో విఘ్నేశ్వర్‌చారి, గోనె మల్లారెడ్డి, పీసరి కృష్ణారెడ్డి, సీతారాంరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, అతీశ్‌బాబు, వెంకటేశ్ నాయక్, పిట్ల లక్ష్మణ్, మురళి పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు

తొమ్మిదేళ్లలో ఏ ఒక్కరికి ఇల్లు ఇవ్వలేదు

సుభాష్‌నగర్: తొమ్మిదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క పేదవాడికి ఇల్లు ఇవ్వలేదని.. కట్టిన ఇళ్లు శిథిలావస్థకు చేరాయని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని గురువారం కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇప్పిస్తామని కొందరు బీఆర్ఎస్ నాయకులు పేదల నుంచి డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. ఇళ్ల పంపిణీలో బీఆర్ఎస్ నేతల జోక్యం ఉంటే ఊరుకోమన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇచ్చేంత వరకు బీజేపీ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు బీజేపీ నాయకులు వినతి పతరం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మూగ జయశ్రీ, బుచ్చిరెడ్డి, జేకే శేఖర్‌యాదవ్, పత్తి రఘుపతి, గరిగే శేఖర్, బావిగడ్డ రవి, జగన్ మోహన్‌రావు, డివిజన్ల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

బాచుపల్లిలో నిర్మించి మూడేళ్లయినా ఇవ్వని ఇళ్లు

నిజాంపేట్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ విమర్శించారు. 'డబుల్' ఇళ్లను అర్హులకు వెంటనే కేటాయించాలని గురువారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. బాచుపల్లిలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి మూడేళ్లు కావస్తున్నా నేటికీ లబ్ధిదారులకు అందజేయలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 23 లక్షలు ఇళ్లను మంజూరు చేయించుకుని వాటిని పేద ప్రజలకు ఇస్తోందన్నారు. తక్షణమే ఇళ్లు ఇవ్వాలని లేకుంటే ప్రజాగ్రహాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, దాసి నాగరాజు, రామచంద్రనాయక్, కాశి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్, నాయకులు



నిజాంపేట్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు